# నిరుడు కురిసిన హిమ సమూహములు

మా ఊరు వెళ్ళటం నాకు చాలా గొప్ప అనుభూతి. నా చిన్నతనం, కాలేజీ చదువు, సృష్టిలోని వింతలు, ఆకర్షణలు, అంతరార్థాలు, అప్పుడప్పుడే అర్థమవుతున్న రోజుల్లో మనసుదగ్గరకు వచ్చిన స్నేహితులు, మా ఊరితోనే ముడిపడి ఉంటారు, వెనక్కు తిరిగి చూసుకొంటే. పెద్దబజారు అంగళ్ళవాడి దగ్గర మెరపకాయబజ్జీలు, ఇంకా స్త ముందుకు వస్తే కూడలి వీధిదగ్గర అమ్మే జాజిపూల చెండ్లు, ఎప్పుడో గాంధీగారు మాఊరువచ్చి అక్కడ పది నిముషాలు నిలుచున్నారట, మునిసిపల్ ఆఫీసుముందిప్పుడు, ఈ దేశంలో జరుగుతున్న అన్యాయాలుచూసి ఆయన శిల అయిపోయినాడు. ఈవరకు ఎన్నికలముందైనా పిలక్కమాత్రం కొ స్త నల్లరంగు, ఒంటినిండా తెల్లపెయింటూ పూసేవారు, ఇప్పుడదీలేదు, ఆయన్ను తలచుకొంటే జాలి కలుగుతుంది. శ్రీరామనవమి రథోత్సవం ఊరికి ఉత్తరాన పెద్ద చెరువు, మునిసిపల్ పార్కు, సినిమాహాళ్ళు, ఊరికి ఒక కొసన రైల్వేస్టేషను, మా ఊరిని తలచుకొంటే, అన్నీ మనో

నేత్రం ముందు సాక్షాత్కారిస్తాయి. ఊరికి దగ్గర చుట్టూ చిన్న చిన్న పల్లెలున్నాయి. పొద్దున్నే ఆ ఊళ్ళనుంచి, కూరలు, పాలూ, సాయం కాలం పువ్వులూ వస్తాయి. వాటిని తెచ్చే పడుచులు, వాళ్ళను గూర్చిన కథలు, హైస్కూలు వార్షికోత్సవాలు, ఆటల పోటీలు, గడచిపోయిన ఆనందమయ ప్రపంచం అది. నేను కూడా మా ఊళ్లోనే స్థిరపడిపోయి, మునిసిపల్ ఆఫీసు గుమాస్తాగానో, హైస్కూలులో టీచర్‌గానో, తాలూకాఫీసులో ఇంకేదోగానో వుండిపోతే, శీతకాలపు యెండలా, వేసవి కాలపు ఉదయంలా, ఇష్టమైన సంగీతంలా, అందమైన ఆడపిల్లల చిరునవ్వులా, మా ఊరిగురించిన అనుభూతులు నన్ను పలకరిస్తూ వుండేవి కావేమో. రోజూ చూసేదాంట్లో అందంలేదు. అంతంత మాత్రమే. అయితే మా ఊరు కాలేజీచదువుతో వదిలిపెట్టేశాను నేను. ఇప్పుడు మా ఊరు వెళ్తున్నాను. ఇంచుమించుగా పదేళ్ళయింది. విజయవాడ నుంచి గుంటూరుదాకా రైల్లోనూ, అక్కడినుంచి బస్‌లోనూ వెళ్ళటం సుఖం. సుళువు మాకు. మంగళగిరి కొండ, శిఖరాన స్వామి, దారిలో పెద్దపెద్ద చెట్లు, తెల్లని రెల్లుపూలు, ఎప్పుడూ మనస్సుకు ఆనందం కలుగజేస్తూనే ఉంటాయి. గుంటూరునుంచి మాఊరు కారులో వెళ్ళాలి. చలి కాలంలో శరీరానికి గిలిగింతలుపెట్టే వాతావరణంమధ్య ధనియాల మొక్కల తాలూకు తెల్లని పూలు విశాలంగా పరచుకొని వుండటం, ఆ పొలాలలోంచి వచ్చే సువాసనలు, గుప్పిళ్ళు గుప్పిళ్ళు కుంకుమ పోసినట్లుగా ఉండే మిరపచేలు, మనుషులు ప్రవేశిస్తే కనపడని గుబురు జొన్న చేలు. కంటికింపు మనసుకు సంతోషమూ కలగజేస్తాయి.

గుంటూరు చేరేసరికి సాయంకాలమైపోయింది. పొరపాటు చేశాననిపించింది. దగ్గరగా ఏదో పెద్ద ఉత్సవం జరుగుతున్నదట. అందువల్ల బస్ మా ఊరివేపు ఎప్పుడు వెళ్తుందో చెప్పలేమన్నారు. నాకు

చాలా కోపం వచ్చింది. ఈ దేశంలో ఎవరికీ బాధ్యతలేదు. ఏ విషయంలోనూ చాలా అనాగరికంగా, అవివేకంగా, అడవిమనుషుల్లాగా ప్రవర్తిస్తుంటారు ఎవరినిచూసినా. రైళ్ళ రాకపోకలనుగూర్చిగాని, బస్సుల రాకపోకలనుగూర్చిగాని ఎవరూ పట్టించుకోరు. జనసమ్మర్దం వుండేచోట్ల, శుచీశుభ్రత ఉండవు. అంతా అయోమయం. ఏ మనిషి ఎక్కడ ఉండాలో, ఎవరి బాధ్యతలు ఎటువంటివో, ఎవరూ పట్టించుకోరు. ఇంకా వేషభాషలపట్ల బానిసబుద్ధి పోలేదు. పరస్పర గౌరవం, కలిసికట్టుతనం, మర్యాద, మన్ననలు, మనుషులు నేర్చుకోలేదు. అయినా అధికార్లనే కలుసుకొని, అసలు విషయం ఏమిటో కనుక్కుందామని కొంచెం దూకుడుగానే వెళ్ళాను. కంట్రోలరక్కడలేడు. ఎంక్వయిరీలో మనిషిలేడు. అంతా గందరగోళం. ఎవరెవరో ఏదో ఒక మాట చెపుతున్నారు. ఇంకోవేపు వెళ్ళే రోడ్డుమీద యాక్సిడెంట్ అయిందనీ, అంచేత ఉదయాన కాని బస్సులు వెళ్ళవనీ, ఎవరో అంటున్నారు. ఏ హోటల్లోనో ఉండాలి కాబోలు, అబ్బురంగా సెలవు దొరికిందే నాలుగు రోజులు. ఇవాళంతా నిరర్థకంగా గడిచిపోయింది. హడావుడిగా తిరుగుతున్నారు కొందరు ఉద్యోగులు. ఎవరుకూడ రెండు నిముషాలు మాట్లాడి, నాక్కావల్సిన సమాచారం చెప్పేట్లులేదు. ఇంతలో "ఏంరోయ్ ? ఎన్నాళ్ళకు కనపడ్డావు. ఇప్పు డెక్కడ వుంటున్నావు. పెద్ద ఆఫీసరువైనట్లుందే" అని అమాంతం ఆప్యాయంగా నా భుజంమీద చెయ్యివేసి పలకరిస్తుంటే నేను విస్తుపోయాను. చిరాకు ముంచుకొచ్చింది. ఎవడీవ్రాసి - అని మనసులోనే రుసరుసలాడాను. మెడమీద కాలరు చిరిగిపోయింది. మూడు రోజులైందో నాలుగు రోజులైందో గడ్డం గీక్కొని. ఉన్నముఖం స్థానంలో రెండు ముఖాలైనట్లుగా వైశాల్యం విస్తరించింది. ఆనందం పట్టలేక ననుకుంటాను. ఎవరినిచూచి ఎవరనుకున్నాడో. అసలేనాకు, అనాగరిక సమాజాన్నంతా, బెత్తంపెట్టి కొట్టి, క్రమశిక్షణ నేర్పించాలని

మనసు కుతకుత వుడికిపోతున్నదీ. మహా చీదరగావుంది. అటువంటప్పుడు, ఎవరో కోన్ కిస్కా నన్ను ఎవరో అనుకుని ఏంరోయ్ బాగున్నావా? అని ఏకవచన నిరాదరపూర్వకంగా, మేనత్త కొడుకులాగా పలకరిస్తాడా. నేను పెద్ద ఆఫీసరుణ్ణి. అసురుల్లో వీళ్ళు ఒకజాతిఅని, నేను ఆఫీసర్ని కానంతమటుకూ, నాకు వుడుకుమోత్తనంగానే వుండేది. కాని అయిన తరవాత, మనుషుల తెగలు రెండే రెండయినట్లు, అందులో ఆఫీసర్లు గొప్పవాళ్ళయినట్లు, తక్కినవాళ్ళు నికృష్టులనీ అనిపిస్తున్నది. అయిష్టాన్ని ప్రదర్శిస్తూ కళ్ళు కుంచించుకొని ముక్కు కిందిభాగాన్ని పైకి సంకోచింపజేసి, నా బుజంమీదవున్న చేతిని నేనే అవతలగా ఉంచాను. మనసులోనే నా చేతిని కడుక్కున్నాను. "ఓరినీ, నన్ను గుర్తుపట్టలేదటరా?" అని అదేదో అంతా నాతప్పే అన్నట్లు ముఖంలోకి చురుకుగా చూశాడా అవతలివ్యక్తి. పెదవులకొసల ప్రేమంతా వొలికిపోయే చిరునవ్వు మీటాడు నా గుండెలోకి. లవ్‌సిగ్నల్స్ మగవాళ్ళ మధ్యకూడా వుండొచ్చు ననుకుంటాను. లేకపోతే నేను కరిగిపోవటమేమిటి. ఆ చిరునవ్వు నా కెంతో ఇష్టం. ఎప్పుడో ఎక్కడో నేను బాగా ఆరాధించింది. నాకు చాలా సుపరిచితమైనది. చీరంతా వెలిసిపోయినా, జరీఅంచుమాత్రం అంతపూర్తిగా పాడైపోలేదన్నట్లున్నదా చిరునవ్వు, అతనిముఖంమీద. నేను వెంటనే గుర్తుపట్టాను కాని, పేరు సమంగా గుర్తురావటంలేదు. నేనురా కృష్ణమూర్తిని అని అతడే చెప్పేశాడు. అవును. కృష్ణమూర్తే. ఇలా అయిపోయాడేమిటి? ఊహించలేక పోయానెప్పుడూ ఇలా జరిగేనని. నేను థర్డుఫారం చదువుకొనే రోజుల్లో ఫిఫ్త్‌ఫారం చదువుతూ వుండేవాడు. నేను తనతో కలిసేదాకా, ఆ క్లాసే చదివి నా కోర్కెను ఎంతగానో మన్నించాడు. అతగాడితో కలిసి తిరగాలనీ, ఒకే బెంచీమీద కూచోవాలని, ఆజ్ఞాపిస్తే చిన్నచిన్న పనులు

చేసిపెట్టి విధేయతను, ఇంకా చెప్పవలసివస్తే సేవకభావాన్నైనా సరే ప్రకటించాలని, నన్ను తహతహలాడినట్లు చేసినవ్యక్తి. మూడు సంవత్స రాలు ఒక్కక్లాసే చదివినా, స్కూలు మొత్తానికి ఆరాధనీయుడైన అప్పటి కృష్ణమూర్తి. నా చిన్నతనంలో మా స్కూలు వార్షికోత్సవాల్లో, ప్రతియేడూ కృష్ణతులాభారం నాటకం ఆడేవారు. మహా రంజుగా వుండేది. అందులో కృష్ణుడివేషం కట్టేవాడు కృష్ణమూర్తి. పేరుకు తగ్గట్టే. కళ్ళ పండుగ్గా వుండేది ఆ రూపు. ఆ ఠీవి. ఆ లాలిత్యం. ఆ చాతుర్యం. హొయలు. సొగసులు. నటిస్తుంటే మనోమోహకంగా పద్యాలు చదివే వాడు. ఒకటే వన్స్‌మోర్‌లు. చివరిసీనులో నునుకుంటాను రుక్మిణినీ, సత్యభామను, అటూఇటూ పెట్టుకొని, మహాసొగసుగా, ఒకరి తరవాత వొకరి గడ్డాల్ని మునివేళ్ళతో స్పృశిస్తూ పద్యాలు చదవేవాడు. అందరూ చప్పట్లు కొట్టేవాళ్ళు. సత్యభామ వేషం, స్కూల్ ఫైనల్‌క్లాసు కుర్రాడు కట్టేవాడు. రుక్మిణి కృష్ణమూర్తి క్లాసుకుర్రాడే వేసేవాడు. వాళ్ళూ చాలా అందంగా వుండేవాళ్ళు. చామనచాయగా వొకరు, ఎర్రగా గుండ్రటి ముఖము, కోలకళ్ళతో వొకరు, రుక్మిణీ సత్యభామల వేషాలు బాగా రక్తి కట్టించే వాళ్ళు. 'రాధను ఒకవైపు లాలించును, సత్యభామను ఒకవైపు మురిపాల తేలించులే', అన్న సినిమా పాటలో రాధ అనవసరంగా వచ్చిందిగాని, రుక్మిణి అవి వుంటే, ఆ పాటకు మా కృష్ణమూర్తి సరి పోయేవాడు.

"ఏమిటి ఎక్కడికి వెళ్ళుతున్నావు. ఎందరు పిల్లలు. ఏం ఉద్యోగం. పదొందలు వస్తాయా" అని అడుగుతున్నాడు కృష్ణమూర్తి. పొరపాటు సవరించుకోటానికన్నట్లు నేనే కృష్ణమూర్తి బుజంమీద చెయ్యివేశాను. నా బాధ చెప్పాను. "నా మాట విను. ఇప్పుడు ప్రయాణం మానుకో. బస్సు వెళ్ళనేవెళ్ళదు ఒకవేళ వెళ్ళినా మన ఊరుదాకా చేరుతుందన్న నమ్మ

కమూ లేదు. పొద్దున్నే ఫస్ట్‌బస్‌లో వెళుదువుగాని. నేనువచ్చి ఎక్కిస్తాను. డిపోదగ్గరే మా ఇల్లు. ఈ కాష్ వప్పజెప్పి వస్తానురా. బీదవాణ్ణని సందేహంబు పడకుమీ, ఆవకాయముక్కతో అన్నంబు తిందువు" అని వెనకటి ఉత్సాహంతో నాటకం డైలాగులా చెప్పాడు. అయినా నేను మాత్రం ఎక్కడికి వెళ్తాను. విసుగ్గావుంది. కృష్ణమూర్తిచేత మంచి పద్యాలు పాడించి వినాలనిపించింది. వెంట నడిచాను. కంట్రోలర్ రూములోకి తీసుకుని వెళ్ళి తన కుర్చీలో నన్ను కూచోబెట్టి, తాను స్టూలు మీద కూచున్నాడు. నేనే దానిమీద కూచుంటానన్నా వినకుండా. గడ్డం నిండా చాలా తెల్లవెంట్రుకలు కనపడుతున్నాయి. లైటు వెలుగులో చూశాను. కళ్ళు లోపలికి పోయినవ్. మీసంకట్టు అందంలేదు, తారుణ్యపు నిగారింపు లేదు ముఖంలో. ఇతడా కృష్ణుడివేషంవేసి, స్కూల్లోని ఆడపిల్లల్నీ మ'పిల్లల్నీ అందర్నీ అలరించేవాడు. మేష్టర్లందరూ కూడా ఎంత ఇష్టపడేవారు కృష్ణమూర్తిఅంటే అని నాకు ఎన్నెన్నో ఆలోచనలు వచ్చాయి. టీ తెమ్మని చెప్పినట్లుంది ఎవరో కుర్రాడు తెచ్చి గ్లాసుల్లో పోశాడు. నేను వద్దంటే ఏమాత్రము వినిపించుకోలేదు. ఆ గ్లాసుల్లో తాగటం నాకిష్టంలేదు. ఆ గది శుభ్రంగాలేదు. ఆ కుర్రాడు తెచ్చిన కెటిల్‌మీద ఏమిటేవిటో మరకలున్నట్లనిపించింది. అయినా విధిలేక రెండు గుక్కలు మింగాను. కృష్ణమూర్తి బీడీ వెలిగించాడు. నాకు కడుపులో దేవినట్లయింది చప్పున ఒక సంగతి జ్ఞాపకం వచ్చింది. ఓసారి స్కూల్లో నాటకం వేస్తున్నప్పుడు. గ్రీన్‌రూమ్‌లో షోడాలు, టీలు, అందించేపని నాకు పురమాయించారు. అదొక పెద్ద గొప్ప ఆ రోజుల్లో. గ్రీన్‌రూమ్‌లోకి వెళ్ళటం ఒక పెద్ద ప్రివిలేజ్ అన్నమాట. 'మూంచిగాకిరీటం పెట్టుకొని, భుజకీర్తులుతగిలించుకొని ముఖానికి కేక్ కొట్టి, తళతళలాడుతూ, అవతలిసీనులోకి రాబోతూ, ఎర్రగా కాలిపోయే బీడిదమ్ము దబ్బుదబ్బున

గుంజుతున్నాడు కృష్ణమూర్తి. ఆ దృశ్యం నాకు మహా చీదరనిపించింది. శ్రీకృష్ణపరమాత్మ బీడి గుంజటం, పైని రుక్మిణితో మోటు సరసమాడుతున్నాడు. బూతుకూతలుకూడా వున్నాయేమోననుకుంటాను. నన్నొ బల్లాకింద చేసేసి నానాపన్లూ చేయించుకొనేవాళ్ళు. సోడాకొట్టించి గాస్ పోకుండా వేలడ్డంపెట్టి తీసుకరావటం, టిఫిన్లు తేవటం, బీడీలు, సిగరెట్లు అగ్గిపెట్టె ఇత్యాదుల సరఫరా. ఆ రోజుల్లో కృష్ణమూర్తి బూట్‌పాలిష్ చెయ్యమన్నా చేసేవాణ్ణేనేమోమరి. అతడంటే అంత ఇష్టంగా వుండేది నాకు. ఆడపిల్లలతడికి లవ్‌లెటర్స్ వ్రాస్తుంటారనీ, ఫలాని మేష్టారింట్లోకి సరాసరి వంటయింట్లోకి వెళ్ళిపోయి అన్నంపెట్టించుకొని తింటాడని, ఆ మేష్టారుగారు ఇంపార్టెంట్ అతడికి చెప్తాడని, జిల్లా పోటీలలో యీసారి కప్పు తప్పకుండా తెస్తాడనీ ఇత్యాదులుగా వుండేవి అతడి గొప్పలప్పుడు. అవన్నీ చెవులు నిక్కపొడుచుకొని వినేవాళ్ళం మేము. అతడేమో పెద్దహీరో, మేము పిపీలికలంగా వుండేది. ఆ రోజు లటువంటివి. అమాయకత్వం, ముగ్ధత్వం చెట్టపట్టాలు పట్టుకొని పరుగులుతీసే పాలపొంగు వయసు. పదమూడేళ్ళ మహాఅయితే పద్నాలుగేళ్ళు.

"ఇటువంటి టీ నీవెందుకు తాగుతావు పెద్ద ఆఫీసరువేమో—మాదేముంది. మాకింతకన్నా గతిలేదు" అని పొగ వదులుతూ నవ్వాడు. నా సంకోచనాలనూ, తొడుగుళ్ళనూ, కుబుసాలను, పొరలను, అన్నీ వూడ్చుకోవాలనిపించింది. మళ్ళీమళ్ళీ నాకిటువంటి సన్నివేశం తటస్థించదు. అరమరికలు లేకుండా ఎవరితో నేను మాట్లాడగలుగుతాను ముందు ముందు. అదంతా వేరే వాతావరణం. చిన్ననాటి తలపోతలు తవ్వి తీసుకొందామనిపించింది. ఆ చిన్నప్పటి రోజులు ఎంత హుషారుగా వుండేవి. మాయలు మర్మాలు, కపటాలు, లేనిగొప్పలు, గిరులూ ఉరులూ లేకుండా. అప్పటికింకా స్వాతంత్ర్యం రాలేదు. కుర్రాళ్ళం అందరం

రాజకీయాలు ఉద్రేకంగా మాట్లాడుకొనేవాళ్ళం. ఉత్సాహం పరవళ్లు తొక్కుతూ వుండేది. యూనివర్సరీ ఉత్సవాలలో "స్వాతంత్రమె మా జన్మహక్కని చాటండీ, నిరంతరమ్మును శత్రువునెదిర్చి పోరాడండీ" అని చక్కగా కోటిరెడ్డి పాడేవాడు. ఆ పాటవింటే ఆవేశోత్పుల్లాలయ్యేవి హృదయాలు. "ఉదయమ్మాయెను, స్వేచ్ఛా భారత హృదయమ్మాయెనహో, ఆసియ ఖండపు వాసుల కోరిక లీడేరెనహో" అంటూ మేరీ, స్వర్ణ అని అక్కచెల్లెళ్ళిద్దరూ కలిసి, ప్రతియేడూ పాడేవాళ్ళు. నాలుగైదేళ్ళు స్కూల్లో చదువుకొన్న రోజుల్లో వార్షికోత్సవాల హైలైట్. ఇప్పుడు వాళ్ళెక్కడున్నారో, ఎందరు పిల్లలను కన్నారో! ఒకరినొకరు హెచ్చరించుకుంటూ ఆ పాట పాడేవాళ్ళు. అందరూ వాళ్ళతో మాట్లాడాలని, దగ్గరగా వెళ్ళాలనీ, తెగ యిదయిపోయేవాళ్ళు. రోజుకో అందంగా జుట్టు ముడిచి, పూలు తురిమి, వచ్చేవాళ్ళు. ఇంకోడుండేవాడు జమాజెట్టి ఆటగాడు. ప్రతి సంవత్సరమూ పది కప్పులన్నా బహుమానాలుగా గెల్చుకొనేవాడు. ప్రతిక్లాసూ పాస్‌చేస్తే త్వరగా స్కూల్లోంచి వెళ్ళిపోతాడనీ, అంచేత జిల్లాపోటీల్లో, అటు తరవాత రాష్ట్రీయ పోటీల్లో ఛాంపియన్‌షిప్ రాదనీ, అందుకని ప్రతిక్లాసూ రెండు సంవత్సరాలు చదివించేవారనీ, చెప్పుకునేవాళ్ళు, అతణ్ణి గూర్చి.

ఇట్లాంటి అభూత కల్పన లెన్నెన్నో సృష్టించేవాళ్ళు కుర్రాళ్ళు. అభిమానంకొద్దీ యెన్నో పుకార్లు, యెన్నో వింతలు ఊహాగానాలు ప్రచారంచేసేవాళ్ళు. అవన్నీ ముచ్చటించాను కృష్ణమూర్తితో. అతనూ కలల్లోకి వెళ్ళిపోయినట్లు ఆ రోజులను గూర్చి వుద్రేకం పొందాడు. ఆర్. టి. సి. లో గుమాస్తా వుద్యోగ్యం గత పదేళ్ళనుంచి చేస్తున్నాడు. జీవితంలో ఎదుగూ బొదుగూ లేదు. జీతంలో వుంటేగా. అద్దె యాభై

రూపాయలు. రెండు గదులు. అక్కడికి దగ్గరే వాళ్ళిల్లు. యెవ రెవరో కండక్టర్లు వచ్చారు మధ్య మధ్య. కృష్ణమూర్తికి కలెక్షన్లు ఇప్ప చెప్పారు. వాళ్ళతో పరాచికాలాడాడు. నా కెందుకో మనసులో వింత కోరిక. వాళ్ళింటికివెళ్ళి అతడి పెళ్ళాన్నీ, బిడ్డల్నీ చూడాలని కోరిక. ఇది అందరిలోనూ గుప్తంగా అణిగి వుంటుందనుకుంటాను. విడమరచి చెప్పటం కష్టం. జీవితంలోని అసంతృప్తిని ఇతరులతో పోల్చుకొని ఊరటో లేక ఇంకా ఆరాటమో పడటం మానవుడిలో సహజలక్షణమేమో. నామట్టుకు నేను సుఖపడుతున్న వాళ్ళనుచూసి యీర్ష్యపడతాను. దుఃఖ పడుతున్న వాళ్ళను చూసి కరిగిపోతాను. అసూయావున్నది. జాలీ వున్నది. చదువుకొనే రోజుల్లో కృష్ణమూర్తి పెద్దనటుడై పోతాడనో లేక యెవరో బోలెడు డబ్బున్న వాళ్ళమ్మాయి అతణ్ణి పెళ్ళాడుతుందనో, లేదా వాళ్ళే ఆదరించి ముచ్చటపడి తమ అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తారనో, అనుకొనేవాణ్ణి. కాలేజీకి వచ్చింతర్వాత క్రమంగా కృష్ణమూర్తిని మరిచి పోయినాను. ఆ తర్వాత అతడూ కాలేజీలో చేరినట్లున్నది కాని చదివినట్లు లేదు.

కృష్ణమూర్తి నన్ను ఇంట్లోకి తీసుకొని వెళ్ళటానికి బాగా సిగ్గు పడ్డాడు. వాళ్లావిడని పరిచయం చేశాడు. ఆమె చూపరిగానే వుందిగాని, బాగా అలసి పోయినట్లూ, దీనంగా వున్నట్లూ అనిపించింది. మళ్ళీ పది పదిహేనేళ్ళు చిన్నవాణ్ణయి పోయినట్లనిపించింది. కాళ్ళు కడుక్కోవడం మంచంమీద కూచోవటం, రెండు గదుల చిన్న ఇంట్లో అతిథిగా కూర్చో వటం ఇటీవల అలవాటు తప్పిపోయింది. యే హోటల్‌కో వెళ్ళిపోయి వుంటే బాగుండుననిపించింది. ఆ ఊళ్లో తెలిసిన బంధువులు కూడా లేక పోలేదు. కాని వచ్చింతర్వాత మరి కదిలితే బావుండదు. నువ్వు నాకోసం ఏమీ శ్రమ పడవద్దు. మీరు వండుకున్నదేదో అదే నేను తింటాను అని

చెప్పాను కృష్ణమూర్తితో. వాళ్ళబ్బాయి లేస్తాడేమోనని, అటూ ఇటూ కాలుగాలిన పిల్లిలా తిరిగాడు కృష్ణమూర్తి. ఆ పిల్లాణ్ణి లేపాలనీ, నాకు చూపించాలనీ అతడి ఆరాటంలా నాకర్థమైంది కాని అప్పటిదాకా యేడ్చి అప్పుడే నిద్రపోయినాడని చెప్పింది వాళ్ళావిడ. కృష్ణమూర్తి సంసారం పరిస్థితులనుచూసి నాకు చాలా జాలి కలిగింది. చాలా రోజులవరకూ పిల్లలు లేకుండా జాగ్రత్త పడ్డానని చెప్పాడు. ఆ తరువాత పిల్లాడు పుట్టాడు, వచ్చిన జీతం సరిపోదు. తనకేం నీతులూ నియమాలూ. ఆ బాధలు లేక పోయినప్పటికీ అంకించుకుందామంటే పైనేమీ దొరకదు. చిన్నతనంలో తనకు వచ్చిన వెండిపూత నికెల్ కప్పులు వాళ్ళ పిల్లవాడు ఆడుకుంటాడు. అంతకన్నా వీటికి విలువలేదు. మూడు రోజులనుంచీ పిల్లాడు తాగే ఫలానిరకం పాలడబ్బాకోసం తిరుగుతున్నాడు. కాని దొరకటంలేదు. బ్లాక్ మార్కెటులో దొరుకుతుంది. కాని పెద్ద ఉద్యోగస్థుల ద్వారాను ప్రత్యేకమైన మనుషులద్వారాను దాన్ని సాధించాలి. బజారులోకి వెళ్ళి ఏదైనా ఒక వస్తువు కావాలంటే నోరులేని పసిపిల్లల ఆహారమైనా సరే, ప్రాణంపోయే పరిస్థితులలో పనికివచ్చే మందైనా, ఇంజెక్షన్ అయినా సరే కత్రీలు, కపటాలులేకుండా ఉండవు. కొరత వున్నదంటే చాలు, అసలు కనపడవు. దాచేసి సాటి ప్రజలను దోచేస్తున్నారు. ఈ దుఃఖం కళ్లలో ఇగిరిపోయి, ఈ కోపం గుండెల్లో రగిలి రగిలి చేసేదిలేక ఇలాగే ఇంకా సాగితే మనుషులు ఒకరినొకరు రక్కుకుంటారు. లంచాలకోసం కంట్రోళ్ళు, త్రాగుడుతోను, వ్యభిచారంతోను. అధికారులను ప్రోత్సహించి, ప్రజలను దోచుకొనే పర్మిట్లు సంపాదించుకొంటారు కొందరు. వాళ్ళకు దయాదాక్షిణ్యాలుండవు. వాళ్ళు నల్లుల్లాంటివాళ్ళు.

బహూ వుపాయంగా తప్పించుకొని పోతారు. అయినా వేణీళ్ళు కాచి పోసి నప్పుడు చావక తప్పదని చాలా ఉద్రేకంగా మాట్లాడాడు కృష్ణమూర్తి. నాకు చాలా కష్టమనిపించింది.

వాళ్ళు పెట్టిన భోజనంబట్టి, మధ్యతరగతి పేదజీవి ఎలా బ్రతుకు తున్నాడో నాకు తెలిసింది. అన్నం సహించలేదు.

నాకు ముందు గదిలో మంచం వేశాడు. రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. నల్లులు పీక్కొని తిన్నాయి. నేను మాటిమాటికి లేచి లైటు వేసుకొని వాటిని చంపుతూ కూచుంటే, వాళ్ళెక్కడ బాధపడిపోతారోనని యమయాతన పడ్డాను. వంట ఇంట్లోంచి అంట్లగిన్నెలు, మురికినీళ్ళ తాలూకు వెగటువాసన. పాలకోసం కాబోలు పసివాడు నాలుగైదుసార్లు యేడ్చాడు. వాళ్ళు కసుక్కుంటున్నారు. బ్రతిమాలుకున్నారు. పసివాడు వినడు. పంచదార నీళ్ళు పట్టారు. శాంతించమని దండాలు పెట్టుకొని వుంటారు. కృష్ణమూర్తి చెప్పిన నల్లుల ఉపమానం జ్ఞాపకానికొచ్చింది. కృష్ణమూర్తి డిపోలో యూనియన్ సెక్రటరీ అట. అందుకే అట్లా మాట్లాడాడేమో. కాకపోయినా అతడు చెప్పినవి కూడా వాస్తవాలే కావచ్చు. బాహాటంగా తెగతాగి క్లబుల్లో యీ నిశిరాత్రి కొందరు దొర్లుతూవుండవచ్చు ముఠా రాజకీయాల నాయకులు కొంపలు ముంచే ఆలోచనలు చేస్తూ వుండ వచ్చు. రాత్రి ప్రపంచం చిత్రమైంది.

ఎప్పుడు తెల్లవారుతుందా భగవంతుడా అనుకొంటూ గడిపాను. వద్దన్నా వినకుండా బలవంతంపెట్టి కాఫీ తాగించాడు పొద్దున్నే. తానే

వచ్చి కారెక్కించాడు. వాళ్ళబ్బాయి దోసపండులా వున్నాడు. కాని వాడిదుడుకులులేని, సజావైన, సూటి అయిన భవిష్యత్తు ఉన్నదా బాబుకు? కృష్ణమూర్తి రెండుచేతులూ పట్టుకొని, ఆ పూట తమఇంట్లో వున్నందుకు యెంతగానో కృతజ్ఞతలు వెలిబుచ్చాడు.

బస్ బయలుదేరి పొలిమేర దాటింది. మంచు పలచబడిపోతున్నది. యెర్రగా యెర్రగా సూర్యుడు. ఎన్నాళ్ళనుంచి చూస్తున్నాడు. ఈ ప్రపంచాన్ని.

— O —